చెత్తశుద్ధి కొరవడి!

- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- నిరుపయోగంగా ప్రజాధనం
- శిథిలమైపోతున్న షెడ్లు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిన వైనం
- పాలకుల అలసత్వం కారణంగా నీరుగారిన లక్ష్యం

పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూర్చేందుకు.. పల్లెల్లో పారిశుద్ధ్య మెరుగుకు చెత్త సంపద కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ముందుగా గ్రామాల్లోని చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది సేకరించి కేంద్రాలకు తరలిస్తారు. అక్కడి సిబ్బంది తడి, పొడి చెత్తను వేరు చేసి వానపాములు వదిలి, వర్మీకంపోస్టు ఎరువుగా మార్చుతారు. దానిని పంచాయతీ అధికారులు రైతులకు విక్రయించి వచ్చిన సొమ్మును గ్రామాభివృద్ధికి వినియోగిస్తారు. అయితే పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. దీంతో లక్ష్యం నెరవేరకపోగా.. పంచాయతీలకు ఆర్థిక వనరులు దూరమయ్యాయి.


నంచర్లలో శిథిలమైన షెడ్డు


నగరదోణ గ్రామంలో వినియోగానికి నోచుకోని చెత్త సంపద కేంద్రం


బంటనహాలులో వర్మీకంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న డీపీఆర్‌సీ ఉన్నతాధికారి (ఫైల్)

చిప్పగిరి: స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామాల్లో సేకరించిన చెత్త ను చెత్త సంపద కేంద్రాలకు తరలించి సేకరించిన చెత్త నుండి తడి మరియు పొడి చెత్త వేరు చేసి చెత్త సంపద కేంద్రాల్లో ఉంచి వానపాముల ద్వారా ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా సంపద సృష్టించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేశాయి. కాగా.. నిర్వహణలో చిత్తశుద్ధి కొరవడటంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారి పథకం నీరుగారిపోయింది. మండలంలోని 13 పంచాయతీల్లో నగరడోణ, కుందనగుర్తి, నంచర్ల, బంటనహాలు, దేగులహాలు, చిప్పగిరి గ్రామాల్లో నామమాత్రంగా వినియోగిస్తున్నారు. గుమ్మనూరు, నేమకల్లు, బెల్డోణ, డొల్తాపురం, కాజీపురం, రామదుర్గం గ్రామాల్లో కేంద్రాలను వినియోగించుకోవడం లేదు. ఏరూరులో షెడ్డు నిర్మాణం పూర్తికాలేదు. మండల కేంద్రంతో పాటు మండలంలోని నగరడోణ, రామదుర్గం, బంటణహాల్, డేగులహాలు, నంచర్ల, గుమ్మనూరు,కుందనగుర్తి తదితర గ్రామాల్లో రూ.5 లక్షల చొప్పున వెచ్చించి చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చారు. ఆయా గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను నామమాత్రంగావినియోగించి వదిలేశారు. మరికొన్ని గ్రామాల్లో అసలు వినియోగానికి నోచుకోక పోవడంతో చెత్త సంపద కేంద్రాలు కాస్త అసాంఘిక కార్యకలాలకు నిలయాలుగా మారాయి. పథక లక్ష్యం గొప్పదే అయినా అమలులో పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. గ్రామాల్లోని చెత్తను తొలగించకపోవడంతో పల్లెలు మురుగు కూపాలుగా మారాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడంతో వ్యాధులకు కారణభూతమవుతున్నాయి.

గ్రీన్ అంబాసిడర్లకు అందని వేతనాలు..

గ్రామాల్లోని చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలకు చేర్చేందుకు ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసింది. వీరికి సర్పంచ్‌లు వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే వీరి వేతనాల బిల్లులు చేసేందుకు అధికారులకు సర్పంచ్‌లు సహకరించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పాటు గ్రీన్‌అంబాసిడర్లు చెత్త తరలింపు పనులు సక్రమంగా చేపట్టడం లేదు. దీంతో వారికి జీతాలు ఇచ్చేందుకు సర్పంచ్‌లు సుముఖత చూపడం లేదు. వేతనాలు అందకపోవడంతో గ్రీన్‌అంబాసిడర్లు పనులు మానేశారు. అలాగే.. ప్రజలు తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వకపోవడంతో గ్రేడింగ్ చేయడానికి ఇబ్బందిగా మారింది.


కుందనగుర్తిలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

కేంద్రాలను వినియోగించాలని కార్యదర్శులను ఆదేశించాం



మండలంలోని 16 గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన చెత్త సంపద కేంద్రాలను తప్పనిసరిగా వినియోగించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. గ్రామంలోని మురుగు కాలువలు, గ్రామ పరిసర ప్రాంతాలు శుభ్రం చేసి సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి, కేంద్రాల దగ్గర తడి, పొడి చెత్త వేరు చేసి కేంద్రాల్లో నిలువ ఉంచి వర్మీ కంపోస్ట్ తయారు పనులను పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలి. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. – బాలన్న, ఈఓపీఆర్డీ

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

మద్దికెర : స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఆదివారం మండలంలో విద్యుత్ శాఖ సిబ్బంది స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు షష్టి ఉత్సవాలను పురస్కరించుకొని సిబ్బందికి స్వామి వారి జ్ఞాపికను అందజేసి వస్త్రాలను అందజేశారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శేషు, రామచంద్రారెడ్డి, ఆంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.

కూలీల సుగ్గిబాట


కోతికొండ నుంచి వలస వెళుతున్న కూలీలు

తుగ్గలి : ఊర్లో వ్యవసాయ పనుల్లేక, ఉపాధి పనులు కరువై వ్యవసాయ కూలీలు వలస బాట పట్టారు. మండలంలోని కోతికొండలో ఇది వరకే పలు కుటుంబాలు వలస వెళ్లగా ఆదివారం మరో 30 కుటుంబాలు వాహనాల్లో సుగ్గి బాట పట్టాయి. తెలంగాణలో పత్తి కోత పనులకు వెళుతున్నట్లు కూలీలు తెలిపారు.

దేవరగట్టులో కార్తీక మాస పూజలు


మాళమల్లేశ్వరస్వామికి హారతినిస్తున్న పూజారులు

హొళగుంద:దేవరగట్టులో కార్తీక మాసం ఆదివారం సందర్భంగా మాళమల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. స్వామి వారాన్ని పురస్కరించుకుని ఆలయ పూజారులు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాబిషేకం, భండారార్చన, పుష్పార్చన, మహామంగళహారతి, ఆకుపూజా, నివేదన, నీరాజనం తదితర పూజలు చేపట్టి నైవేద్యం సమర్పించారు. పలువురు భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మాత మాళమ్మ, శివాసన కట్టను పూలతో విశేషంగా అలంకరించారు. పలువురు భక్తులు గిరి పై వరకున్న 401 మెట్లకు బండారం పూసి, టెంకాయ కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పూడిక తొలగింపు

హొళగుంద: మద్దిలింగదహళ్లి (ఎం.డీ హళ్లి) గ్రామంలో పూడిపోయిన మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు పనులను ఆదివారం సర్పంచ్ సుధాకర్ చేపట్టారు. గ్రామంలోని ఆయా వీధులతో పాటు ప్రధాన రోడ్డులోని డ్రైనేజీలు పిచ్చి మొక్కలు, ఇతర చెత్త చెదారంతో నిడిపోవడంతో మురుగునీరు ముందుకెళ్లకుండా నిలిచిపోయింది. సమస్యను గుర్తించి పూడిక తొలగింపు పనులు చేయించారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



ఆర్యవైశ్య నేతలతో మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఆయన వెల్దుర్తిలోని అమేజాన్ హోటల్ వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులతో మాట్లాడారు. జిల్లాలో ఆర్యవైశ్యుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతోపాటు వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేపట్టి సంఘాన్ని మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం జనరల్ సెక్రటరీ అత్తులూరి కృష్ణ కిరణ్, ఆర్యవైశ్యమహాసభ కో–ఆర్డినేటర్ ఇల్లూరు లక్ష్మయ్య, మహేష్‌బాబు పాల్గొన్నారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కృష్ణగిరి: కంది పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని పోతుగల్లు తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన కంది పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కంది పంట ప్రస్తుతం పూత దశలో ఉందని, గూడు కట్టే పురుగు, మారుక మచ్చల పురుగు ఆశిస్తే నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ మందు పిచికారీ చేయాలని చెప్పారు.

ఎల్లెల్సీలో గుర్తు తెలియని మృతదేహం

హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి గ్రామ సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) 67వ డిస్ట్రిబ్యూటరీలో ఆదివారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం కొట్టుకుపోయింది. దాదాపు 45 ఏళ్లకు పైగా వయస్సున్న వ్యక్తి తెల్ల చొక్కా, నల్ల లుంగి ధరించినట్లు తెలుస్తోంది. దిగువ కాలువ కర్ణాటక నుంచి హాలహర్వి, హొళగుంద మండలాల్లో ప్రవేశిస్తుంది. మృతుడు కాలువలో పడి దాదాపు రెండు, మూడు రోజులై ఉండొచ్చని, మృతదేహం ఉబ్బిపోయిందని స్థానికులు తెలిపారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం


విగ్రహ ప్రాణ ప్రతిష్ఠలో పాల్గొన్న అజాత శంభులింగ శివాచార్య మహాస్వామి

హొళగుంద: మండల కేంద్రం శివారులో వెలిసిన అగ్రహార ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అజాత శంభులింగ శివాచార్య మహాస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేపట్టారు. పురోహితుడు రాచయ్యస్వామి ఆధ్వర్యంలో గంగ పూజ, హోమాలు, రుద్రాభిషేకం, ఆకుపూజ తదితర పూజలు చేపట్టారు. భక్తులకు అగ్రహార ఆంజనేయస్వామి సేవా సమితి సభ్యులు అన్నదానం చేశారు.

అ 'పూర్వ'కలయిక .. ఆనందోత్సాహాల వేడుక


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మద్దికెర : వారంతా 30 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. ఆ తరువాత వేర్వేరు దారుల్లోకి వెళ్లిపోయారు. వారంతా మళ్లీ ఆదివారం కలుసుకోవడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఆప్యాయ పలకరింపులు.. కౌగిలింతలు.. నాటి స్మృతులను గుర్తు చేసుకొని సంతోషంగా..ఉల్లాసంగా గడిపిన క్షణాలకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల వేదికైంది. 1992–93లో పదవ తరగతి చదివిన విద్యార్థులు స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో కలుసుకున్నారు. 30 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం ఒకరికొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తీర్మాణించారు. అలాగే వెనకబడిన, పేదరికం, కష్టాల్లోనున్న తోటి విద్యార్థులకు సహకారం అందించాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు రామకృష్ణారెడ్డి, ధనుంజయ, శంకర్, మంజునాథ్, నాగరాజు, వెంకప్ప, నారాయణ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

వలసలను నివారించాలి

ఆస్పరి: గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ముత్తుకూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో వేల కుటుంబాలు వలసబాట పట్టాయన్నారు. అధికారులు ఉపాధి పనులు కల్పించడంలో విఫలమైయ్యారని మండిపడ్డారు. ఈనెల 6వ తేదీన ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సచివాలయాలు దగ్గర ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధిలో జరగుతున్న అవినీతిని అరికట్టాలని ఆయన కోరారు. నాయకులు శేఖర్, బాలకృష్ణ, లింగన్న, తిక్కన్న, రామాంజినేయులు, నాగన్న, రంగరాజు, దేవేంద్ర, గోపాల్, నరసింహులు, నాగరాజు పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాల అనుమతులను ఉపసంహరించుకోవాలి


అటవీ పాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

దేవనకొండ: యురేనియం తవ్వకాలకు కేంద్రం ఇచ్చిన అనుమతులను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాల ప్రతిపాదిత ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం కప్పట్రాళ్ల గ్రామంలో యురేనియం అనుమతులు, తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామస్తులతో సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ తవ్వకాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడుదామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఈనెల 6న కప్పట్రాళ్ల గ్రామంలో పర్యటిస్తారని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజా సాహెబ్, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు, రైతుసంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు, సురేంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మెదేహాల్ వాసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంద్ర

హాలహర్వి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చంద్ర సూచించారు. ఆదివారం రాత్రి మండలంలోని మెదేహాల్ గ్రామంలో పర్యటించి, నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. తెలయని నంబర్ల నుంచి కాల్స్ వచ్చినప్పుడు బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు వివరాలు ఇవ్వరాదని చెప్పారు. ఒకవేళ ఇస్తే మీ బ్యాంక్ ఖాతా నుంచి నగదు దోచేస్తారన్నారు. కావునా గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు, మొబైల్ ఫోన్‌లు ఇవ్వరాదన్నారు. చిన్నపిల్లలకు మొబైల్ ఫోన్‌లు, బైక్‌లు ఇవ్వొద్దని సూచించారు. ముఖ్యంగా పిల్లలను నిత్యం గమనిస్తుండాలని, వారు విద్యాలయాలకు వెళ్తున్నారో లేదో పరిశీలించాలని కోరారు. కానిస్టేబుల్ విజయ్‌కుమార్, పాండు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పత్తికొండ(తుగ్గలి): పట్టణ సమీపంలోని పార్వతి కొండ వద్ద పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.10,318ల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: మండల కేంద్రంతో పాటు గజ్జహళ్లీ, హెబ్బటం, ఎల్లార్తి గ్రామాలకు చెందిన 27 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాలనరసింహులు ఆదివారం తెలిపారు. దీపావళి పండగు సందర్భంగా ఆయా గ్రామాల్లో పేకాట ఆడుతుండగా దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.45,490 నగదు, ప్లే కార్డులను స్వాధీనం చేసుకుని, రెండు బైకులు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆర్థిక సాయం


సోమిరెడ్డికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

హొళగుంద: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బకాడి సోమిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి ఆదివారం ఆర్థిక సాయం చేశారు. ఆదివారం బళ్లారి పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న సోమిరెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్యస్థితిగతులను అడిగి తెలుసుకుని రూ.20 వేల నగదు అందజేశారు.

10న ఓపెన్ చెస్ టోర్నమెంట్

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నేషనల్ పాఠశాలలో ఈనెల 10న స్పార్క్ చెస్ అకాడమీ వారు ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నేషనల్ పాఠశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి తెలిపారు. సాయి జ్యోతి నేత్రదాన ఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగే పోటీల కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 5 సంవత్సరాలు పైబడిన వారు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 9885103381 నంబర్‌కుకు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో స్పార్క్ చెస్ అకాడమి కోచ్ జంబులయ్య, ఐ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లు శ్రీధర్, నాగరాజు మహాదేవప్ప పాల్గొన్నారు.

రాజగోపురానికి విరాళం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. బెంగళూరు వాస్తవ్యులు ఇల్లూరు విజయకుమార్ వారి కుటుంబ సభ్యులు రూ. 70వేలను అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి, స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును అందజేశారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


పెద్దహుల్తిలో హుల్తిలింగేశ్వర, కారుమంచేశ్వరస్వాముల ఊరేగింపు


స్వామి కాలి స్పర్శ కోసం సాష్టాంగ నమస్కారం చేస్తున్న మహిళలు

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని పెద్దహుల్తిలో కొలువైన శ్రీ హుల్తి లింగేశ్వర, కారుమంచేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు కనువిందువగా సాగాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం వేకువ జామున ఆలయ పూజారుల ఆధ్వర్యంలో గంగ పూజ, గ్రామోత్సవం వైభవంగా చేపట్టారు. ఉత్సవాలకు స్థానికులతో పాటు కర్ణాటక, తమిళనాడు, తదితర ప్రాంతాల నుంచి భక్తులతో గ్రామం కిక్కిరిసి పోయింది. గ్రామ వీధుల గుండా బీరప్ప డోళ్లు, గొరవయ్యల సంప్రదాయ నృత్యాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం భక్తజన సందోహం మధ్య ప్రధాన ఆలయం వరకు సాగింది. అంతకు ముందు గంగపూజ అనంతరం ఊరి చివర ఉన్న ఆలయం ఎదుట ఉత్సవ మూర్తులను ఎత్తుకుని భక్తులు బీరప్ప డోళ్లు, గొరవయ్య నృత్యాలకు అనుగుణంగా లయబద్ధంగా నృత్యాలు చేశారు. అనంతరం కాలి స్పర్శ కోసం భక్తులు సాష్టాంగ నమస్కారం చేశారు. స్వామి వారి కాలి స్పర్శతో తమ కష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు. సర్పంచ్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎంపీ నాగరాజు, గ్రామస్తులు స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దవాగు.. పూడిపోయింది!

- పెరిగిన కంపచెట్లతో ఆనవాళ్లు కోల్పోయిన వాగు
- కాలనీల్లోకి వస్తున్న వర్షపునీరు
- ఇబ్బందుల్లో కాలనీ వాసులు


హాలహర్వి సమీపంలో ముళ్లకంప, పిచ్చిమొక్కలు పెరిగి ఆనవాళ్లు కోల్పోయిన పెద్దవాగు

హాలహర్వి: మండల కేంద్రం శివారులో ఉన్న పెద్దవాగులో ముళ్లకంప, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో వర్షాలు కురిస్తే వర్షపునీరు వాగులో నుంచి సమీప ఎస్సీ,బీసీ కాలనీల్లోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాలంగా ఉన్న వాగు కంప చెట్లు పెరిగిపోయి, పూడిక నిండి ఆనవాళ్లు కోల్పోయి కుంచించుకుపోయింది. దీంతో నీటి ప్రవాహం పట్టక సమీప ప్రాంతాల్లోకి విస్తరించి పారుతోంది.

వాగులో పూడిక తీసి, కంపచెట్లు తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే.. నిట్రవట్టి గ్రామానికి వెళ్లే వంతెన చిన్నదిగా, తక్కువ ఎత్తులో ఉందని, వంతెన ఎత్తు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

11న ఆలయ పునరుద్ధరణోత్సవాలు


విశేష అలంకరణలో బల్గోట బసవేశ్వరస్వామి

హాలహర్వి: ఈనెల 11వ తేదీన మండలంలోని బల్గోట బసవేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా నూతన గోపురం, కలశం ప్రారంభోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. ఉదయం 9–15 నుంచి 10:30 గంటల సమయంలో కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని చెప్పారు.


మిరపను ఆరబెడుతున్న రైతు గాదిలింగ


మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

గిట్టుబాటు ధర లేదన్నా!


గిట్టుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు రామన్న

ఆలూరు: కష్టపడి పంట పండించినా గిట్టుబాటు ధర లేదన్నా అని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 12వేల హెక్టార్లలో మిర్చి పంటను బోరుబావుల కింద రైతులు సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దిగుబడులు తడిసిపోయాయి. ఓ వైపు గిట్టుబాటు ధర లేక, మరోవైపు తడిసిన మిర్చికి కలర్ తగ్గుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. తడిసిన మిర్చిని ఎండబెడుతున్నామని అరికెర గ్రామానికి చెందిన రైతులు రామన్న, గాదిలింగప్ప ఈరన్న తెలిపారు. ప్రస్తుత ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా వచ్చేలా లేదని వాపోయారు.